# కోడి బతుకు

తిరుపతిగాడి తల్లికి అంతంత మాత్రమే ఆరోగ్యం.

ముక్కుతూ, మూలుగుతూ, ఆగుతూ, పని చక్కబెట్టుకుంటూ ఉంది. కాస్త పని చేసేప్పటికి అలసటా, ఆయాసం.

‘కాదు రమ్మంటుంది – ఊరు పొమ్మంటుంది’ అన్నట్లుంది. వంట్లో శక్తి ఉన్నప్పుడు వీళ్లింట్లో వాళ్ళింట్లో బియ్యం బాగుచేయటం, అంట్లపనీ పాచిపనీ చేసి వాళ్లిచ్చే నూకలూ, పచ్చళ్లు తెచ్చుకుని కాలక్షేపం చేసేది. భర్త పోయాక ఆ బెంగతో వయస్సూ తోసుకొచ్చింది.

ఓపిక పోయాక ఆవిణ్ని ఎవరూ పిల్చేవారు కాదు – ‘పాపం ఇంక పని చేయలేనేదేమో’

మిగిలిన కూరలూ, పచ్చళ్లూ ఉంటే ‘ఓ అడుగిటొచ్చి ఇవి పట్టుకెళ్లవే నరసమ్మా!’ అని పక్క పెరట్లోంచి కరణంగారమ్మాయో, మేష్టారి కోడలో పిలిచేవారు. ఓపిక చేసుకుని లేచెళ్లి... తెచ్చుకుని, గిన్నెలు కడిగి బోర్లించొచ్చేది.

ఇంత కష్టపడుతూన్న ఆ ముసలిదాన్ని చూసి.... పట్టించుకోకుండా చిన్న పిల్లాడిలా సతాయించేస్తాడు కొడుకు తిరుపతిగాడు.

ఆవిడకి వాడు ఒక్కడే. తల్లి అన్న ప్రేమాలేదు. పాపం ముసల్దిలే అని జాలీ లేదు.

వాడేం పని వెలగబెడతాడో తెలియదుగానీ పొద్దున్నే వెళ్ళిపోతాడు. రాత్రి చీకటి పడ్డాక వస్తాడు.

తల్లితో మాట్లాడేది కేవలం తిండి విషయమే.

ఆ రోజు తిరుపతి చాలా బీభత్సం ప్రారంభించాడు. వెళ్లేప్పుడు నర్సమ్మకి కోడికూరొండమని ఆర్డర్ చేసి వెళ్లాడు. తల్లి ఓపిక తెల్సున్నదే అయినా ముందు తిరుపతి కోరిక జరిగి తీరాలి. వీధంతా వినిపించేంత రాద్ధాంతం మొదలెట్టాడు.

“కొడుకుకి కావల్సినది వొండి బెట్టలేనమ్మ ఉంటేనే, సస్తేనే... సీ

ఎదవజనమ!!" అన్నాడు. చివుక్కుమంది నర్సమ్మ ప్రాణం.

"ఒరే నాది వండిపెట్టే వయసు కాదురా, కూకోపెట్టి తినబెట్టాల్రా. నువ్ ఏం చేశావో పెళ్లాం పుట్టింటికెళ్లి కూకుంది. కోడలు సుఖపెదుతుందన్నా ఆ 'ఇది' కూడా లేకుండా చేశావు. కానుపై ఆర్నెల్లయినా ఇంకా ఇంటికి పెళ్ళాన్ని పిల్లాణ్నైనా తెచ్చుకోలేదు. నీకు ప్రేమల్లేవురా..."

"నీలాగే ఆళ్లూ... నా నెత్తిమీద కూచోలేదు గనక బతికిపోయింది. నీతోనే బతకలేక సస్తున్నాను"

"తప్పారే... నువ్ సావడమేంటి కుర్ర ఎదవ్వి – ముసలి ముండని నేను సావాల. మీదింకా ఉండేకాలం"

"నువ్వుంటావే – నేను సచ్చేదాక పోవు!!"

"రామ... రామ" అంది నర్సమ్మ.

+ + +

'రామ... రామ' అనుకుంది ఎక్కిరిపించినట్లు బుట్టలో ఉన్న కోడి.

గుడ్డులో ఉన్నప్పణ్నించీ – పసిగుడ్డులా బైటకి తిరుగుతోన్నప్పణ్నుంచీ అది అమ్మానాన్నల్ని అంటిపెట్టుకుని తిరుగుతుండేది.

అమ్మ ఒక్క క్షణం కనిపించకపోతే విలవిల్లాడిపోయేది.

అప్పుడో రోజు అమ్మని చూసినప్పుడు, ఇంకోసారి నాన్నని చూసినప్పుడూ ఇలాగే తిరుపతిగాడికి నోరూరింది. వాళ్ల బతుకులు పొయ్యేక్కేయి. ఇవ్వాళ తన వంతు వచ్చింది. ఇది సహజం అనుకుంది. అప్పుడు పడినంత దుఃఖం ఇప్పుడు పడట్లేదు. తోడపుట్టి పెరిగిన వాళ్లందరూ ఒక్కొక్కళ్లుగా అయిపోయారు. తన పిల్లలూ రెక్కలొచ్చి పెరిగి పెద్దాళ్లయాక

వాళ్లా ఒక్క వేటుతోనూ, ఒక్క పూటతోనూ మట్టిలో కల్సిపోతారు అనుకుంది.

మహా అయితే (ఎవ్వరూ నరకకపోతే) ఆర్నెల్లో మరో నెల్లాళ్లో మా జీవితం – మనుషుల్లా అరవై – డెబ్బై – తొంభై ఇంకా బతికి నరసమ్మలా... కన్నవాళ్లతోనూ, వాళ్లు కట్టుకున్న వాళ్లతోనూ కష్టాలు పడుతూ... కన్నీళ్లు తుడుచుకుని లేస్తూ చావుకోసం తపస్సు చేస్తూ చస్తూ బతకక్కర్లేదు – అనుకుంది కోడి.

✦ ✦ ✦

తిరుపతీ నరసమ్మల తగాదా ఇంకా నడుస్తోంది.

తిరుపతి అరుస్తున్నాడు. నరసమ్మ ఏడుస్తోంది.

"ఓపిక పోయిన మనుషుల్ని తీసుకెళ్లిపోవాల్రా ఆ దేవుడు. కానీ నువ్... ఆ పాపం చెయ్యకు. కొడుకు చేత ఇలా కొడవలి ఎత్తించుకుంటే... కాదురా... కొరివి పెట్టించుకుంటే పుణ్ణెం – నీకూ నాకూనూ"

"సీ నీయవ్వ" కోపంగా కొడవలి విసిరేశాడు తిరుపతి.

వాడి చేతిలో చస్తానని భయంగా కూలబడిన నరసమ్మ కూడదీసుకుని పైకి లేచింది. 'ఆడు తన్ని సంపేస్తే నలుగురూ పోగై వాణ్ని పట్టుకుని జైల్లోకి నెట్టేస్తారు' అని కన్నతల్లి భయం.

"రెడ్డమ్మగారింట్లో పులుసడిగి తెస్తాను. సింతకాయ పచ్చడి ఉంది. ఈ పూటకి వేసుకు తిను! రేపు కూరొండుతాను" ఏడుస్తూ బతిమాలింది.

ఇంతలో పెళ్లాం పిల్లాడితో ఎల్లుండి వస్తున్నట్లు... పక్క ఊర్నించి చింతాలుగాడు కబురు తెచ్చాడు.

తిరుపతి ముఖంలో వెయ్యి కాగడాలు వెలగలేదు కానీ 'అమ్మయ్య'

అనుకున్నాడు.

"ఓ ముసిల్దానా... నువ్వొండద్దులే.. ఏ మాటకామాటే చెప్పుకోవాలి నీ కోడలు నీకన్నా కూర బాగా వొండుద్ది"

తల్లి ముఖంలో మాత్రం వెయ్యి కాగడాలు వెలిగాయి.

"బంగారంలాంటి మాటన్నావు నాయనా" మురిసిపోయింది ముసలమ్మ.

✦ ✦ ✦

కోడి 'కొక్కొరోక్కో'మని నవ్వుకుంది.

ఈ ముసలమ్మ ఎప్పుడూ ఇంతే... అసలుముసలమ్మలందరూ అంతే!!!

✦ ✦ ✦

మూడోనాడు సాయంత్రం కోడలు కొడుకుతో వచ్చింది.

గూడెం అంతా గుమిగూడారు! అందరూ తలోసారి మనవడినెత్తుకుని మురిసిపోతుంటే ముసలమ్మ మహారాణిలా మెరిసిపోయింది. లేని ఓపికొచ్చింది.

పిల్లాణ్ని ఎత్తుకుని ముద్దులాడేందుకు పుట్టగానే చూడ్డానికి వెళ్లింది. అప్పుడు దబ్బపండులా ఉన్నాడనుకుంది. ఇప్పుడు గుమ్మడిపండులా తయారయ్యాడు. కాగుపొయ్యి రాజేసి వేన్నీళ్లు పెట్టి... తంపడిక్కాసినీళ్లు ఉంచి, పిల్లాడికి పోసింది. బొట్టెట్టి మరో జుబ్బా తొడిగింది. "దొరలాంటి నా మనవడికి మరీ ఇట్టాటి సొక్కా ఏంటి?" అంది వాణ్ని ముద్దాడుతూ–

"వాళ్ళమ్మమ్మ కాడయ్యే ఉన్నాయి – ఆళ్ల నాన్నమ్మ కొంటది దొరబాబు

సాక్కా" చురుక్కున కోడలి జవాబు -

చివుక్కుమంది ముసలావిడ ప్రాణం.

ఆ ఒక్క మాటకి చాలాసేపు చాలా జవాబులు చెప్పింది కోడలు.

ఇందాకా గుమిగూడిన ఆడంగులంతా కోడలు నోటి మాటలు చిత్రంగా వింటున్నారు.

అర నిముషంలో గుడ్డ ఉయ్యాలా కట్టి పిల్లాణ్ని నర్సమ్మ చేతిలోంచి లాక్కెళ్లింది - అంతసేపూ విస్తుపోయి చూస్తోంది నరసమ్మ.

✦ ✦ ✦

కోడి విస్తుపోలేదు. గిలగిలా కొట్టుకుంది. గడబిడగా అరిచింది. అది కోడల్ని తిట్టటం కాదు. అత్తని కోప్పడ్డం కాదు. మనుషులంతా ఇంతే... అనుకుంటూ అరచింది.

"ఇప్పుణ్నీకేమైందే పిచ్చి మొహమా?" అనుకుంటూ నరసమ్మ వచ్చి కోడిని గుట్టలోంచి తీస్తుంటే -

"ఎదవగోల కోడిగోల! ఇంక పిల్లాడు పడుక్కున్నట్లే" కోడలు అన్న మాటలు వినిపించాయి. కోడిని చూసి ముసలమ్మకి జాలేసింది. అయినా కోడి గొంతు నొక్కేసింది.

✦ ✦ ✦

మర్నాడు పొయ్యెక్కేసింది. కానీ నరసమ్మ తినలేదు. కాదు... వాళ్ళ కోడలూ కొడుకూ పెట్టలేదు. అంతేకాదు మనవణ్ని మళ్లీ ఒళ్లో కూచోపెట్టుకోనీయలేదు.